




# కరపత్రం

SINCE 2014

ఆదివారం మార్చి 23 2025 | సంపుటి :0 | సంచిక : 160 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# తెలంగాణకు 42 పైసలే..

## బిహార్‌కు మాత్రం రూ.6.06: సీఎం రేవంత్

చెన్నై: కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

'తెలంగాణలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించాం. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలోనూ వృద్ధి సాధించాం. తెలంగాణలో సుపరిపాలనతోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే.. తెలంగాణకు 42 పైసలు తిరిగొస్తున్నాయి. తమిళనాడుకు 26 పైసలు, కర్ణాటకకు 16 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ, బిహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది. యూపీకి రూ.2.03, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 మేర లభిస్తోంది" అని రేవంత్‌రెడ్డి వివరించారు.

"రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు విఘాతం సృష్టిస్తాయి. డీలిమిటేషన్.. రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుంది. పారదర్శకంగా లేని ఈ విధానంపై భాజపాను కట్టడి చేయాల్సి ఉంది. లోక్‌సభ సీట్లు పెంచవద్దు.. రాష్ట్రాల్లో అంతర్గత డీలిమిటేషన్ చేపట్టాలి. 1976లో లోక్‌సభ సీట్లు పెంచకుండానే డీలిమిటేషన్ చేపట్టారు. ప్రధాని మోదీ కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా దీనిని చేపట్టాలి. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవు. ఇలా చేస్తే దక్షిణాది రాజకీయ వాణి కోల్పోతుంది. దక్షిణాదిని సెకండరీ సిటిజన్లుగా



ఉత్తరాది మారుస్తుంది. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను ఆమోదించొద్దని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నాం. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం" అని రేవంత్ స్పష్టం చేశారు.

## రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే.. పార్టీ అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు: రాజాసింగ్



హైదరాబాద్: సొంత పార్టీ నేతలపై భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి త్వరలో కొత్త భాజపా అధ్యక్షుడు వస్తున్నారని చెప్పారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేది రాష్ట్ర కమిటీనా, జాతీయ నాయకత్వమా అని ప్రశ్నించారు. "రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే కొత్త అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు. కొత్త అధ్యక్షుడిని జాతీయ కమిటీ నిర్ణయిస్తే బాగుంటుంది. గతంలో మనం చూసిన అధ్యక్షుడు గ్రూప్ తయారుచేసుకొని పార్టీకి నష్టం చేశారు. కొత్త భాజపా అధ్యక్షుడు అదే గ్రూపిజం చేస్తే పార్టీకి నష్టం. ప్రస్తుతం మంచి నాయకుల చేతులు కట్టి పడేశారు. సీనియర్ నాయకులకు స్వేచ్ఛ ఇస్తే తెలంగాణలో భాజపా ప్రభుత్వం వస్తుంది. పేజి 2లో

## డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలి: కేటీఆర్

డీలిమిటేషన్‌పై ప్రశ్నించకుంటే తమను చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పేజి 2లో



## రాష్ట్రవ్యాప్తంగా దావత్ ఏ ఇఫ్తార్



**నిధులకు కొరత లేదన్న డిప్యూటి సిఎం**

**రంజాన్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశం**

దావత్ ఏ ఇఫ్తార్ ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీ సమావేశ మందిరంలో ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. పేజి 2లో



## మంత్రి కోమటిరెడ్డిపై బిఆర్ఎస్ హక్కుల నోటీస్

2లో

## హైదరాబాద్‌లో తిరిగే వారికి వ్యవసాయం ఏమి తెలుసు

**వరివేస్తే ఉరే అని కెసిఆర్ అనలేదా**

**పాడికౌశిక్ రెడ్డికి ఘాటు సమాధానం ఇచ్చిన సీతక్క**

హైదరాబాద్,మార్చి22(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై మంత్రి సీతక్క




## రెవెన్యూ శాఖలో 10,954 పోస్టులు మంజూరు

హైదరాబాద్: తెలంగాణలో రెవెన్యూ శాఖలో కొత్తగా 10,954 గ్రామ పాలనా అధికారుల పోస్టులు మంజూరు చేశారు. మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్ఏల నుంచి ఆప్షన్లు తీసుకుని వీటి నియామకాలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.




## స్టాక్ మార్కెట్ పేరుతో రూ.1.22 కోట్లు టోకరా.. నిందితుడి అరెస్టు



2లో

## పరీక్ష రాసి తిరిగొస్తుండగా రోడ్డు ప్రమాదం.. పదో తరగతి విద్యార్థిని మృతి




హైదరాబాద్, రాయదుర్గం: నగరంలోని గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. వివరాల్లోకి వెళ్తే.. టీఎన్‌జీవో కాలనీకి చెందిన యువకుడు.. తన సోదరిని పదో తరగతి పరీక్ష రాయించేందుకు గచ్చిబౌలిలోని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాడు. పరీక్ష రాసిన తర్వాత తిరుగు ప్రయాణంలో గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్ కింద పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థిని ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా.. ఆమె అన్నకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన యువకుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయదుర్గం పోలీసులు తెలిపారు.

## దిల్లీ బడ్జెట్.. 10 వేల సూచనలు అందాయి: సీఎం రేఖాగుప్తా

త్వరలో ప్రవేశపెట్టనున్న దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు సీఎం రేఖాగుప్తా వెల్లడించారు. 2లో

## డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే: బండి సంజయ్



గత పదేళ్లలో తెలంగాణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు.

గత 10 సంవత్సరాల్లో తెలంగాణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని బండి సంజయ్ విమర్శించారు.

కాంగ్రెస్ హయాంలోనూ రైతులను ఆదుకున్న దాఖలాలు లేవని అన్నారు.

ప్రస్తుతం వడగళ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని అన్నారు. పేజి 2లో

# కొంటే... కొరివి దెయ్యమే!



"భారత్ ఒక సరికొత్త ప్రపంచానికి అలవాటు పడాల్సిన అవసరం ఉంది" – ట్రంప్‌ను ఉద్దేశించి విదేశీ వ్యవహా రాల మాజీ కార్యదర్శి ఒకరు అన్న మాట. ఈ కొత్త ప్రపంచం కేవలం ఒప్పందాలు, వ్యాపారాలకు మాత్రమే పరిమితమనీబీ మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరనీ కూడా ఆయన అన్నారు. ఒక దౌత్యవేత్త ఈ అంచనాకు వచ్చారంటే కచ్చితంగా అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ అనూహ్యమైన వ్యక్తిత్వమే కారణమై ఉంటుంది.తేలిగ్గా చెప్పాలంటే... ఈ రోజుల్లో పరిస్థితి నాటకీయంగా మారిపోయింది. కొత్త సంవత్సరంలో యూఎస్ఏ తన లావా దేవీలను వేగంగా మొదలు పెట్టేసింది. ఈ ఏకపక్ష ధోరణితో అమెరికా మిత్రులు, శత్రువులు కూడా తమని తాము కాపాడు కునేందుకు దాక్కుండిపోతున్నారు. లేదంటే వ్యక్తిగతంగా ట్రంప్ ముందు ప్రత్యక్షమై ఆయన శీతకన్ను పడకుండా ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండింటి వల్ల కూడా ఏదో అర్థవంతమైన పని జరుగుతుందని ఎవరూ ఆశించడం లేదు.ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే... ట్రంప్ ఇప్పుడు అమెరికన్ కంపెనీ 'లాక్‌హీడ్ మార్టిన్ ' తయారు చేసిన ఎఫ్–35 యుద్ధ విమానాలు కొనమని భారత్‌కు చెబుతున్నారు. భారత్‌తో ఉన్న సుమారు 3,500 కోట్ల డాలర్ల వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు అన్నమాట. అయితే ఏ అంత ర్జాతీయ ఒప్పందం, వ్యాపారమైనా కేవలం అమ్ముతామంటే సరిపోదు. కొంటున్నామని అవతలి వారు చెప్పాలి. భారత్‌దృష్టి కోణం నుంచి చూస్తే – అమెరికా అమ్ముతానూ అంది, మరి కొనదలుచుకుంటే ఆ ఎఫ్–35 యుద్ధ విమానాలు ఎలాంటివో పరిశీలించాలి కదా?

### తడిసి మోపెడు ఖర్చు

రవాణా, గాల్లోంచి సామగ్రి పడవేసే 'డగ్లస్ డీసీ–3 డకోటా', 'ఫెయిర్ చైల్డ్ ప్యాకెట్ సీ119 జీ' మినహా మరే ఇతర అమెరికా విమానాన్నీ భారతీయ వైమానిక దళం ఇంతవరకు వాడలేదు. 1947 నుంచి చూసినా అమెరికా యుద్ధ విమానం మన వద్ద ఎప్పుడూ లేదు. కాబట్టి అకస్మాత్తుగా ఎఫ్–35లను కొనుగోలు చేయడం అంటే, అది కూడా ట్రంప్ మాటపై ఆధారపడి అంటే... కొంచెం అనుమానంగా చూడాల్సిన వ్యవహారమే! అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు, చరిత్ర లను పరిగణనలోకి తీసుకుంటే ఇలా చూడటం మరీ ముఖ్య మవుతుంది. ఒక విషయమైతే స్పష్టం. భారత్ వంటి అతిపెద్ద దేశంలో వైమానిక దళం ఒక్క రోజులో సిద్ధం కాదు. వైమానిక దళాన్ని నిర్మించడం అంత తేలికైన వ్యవహారమూ కాదు. భారీ పెట్టు బడులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, రిస్క్ తీసుకో గలిగిన తెగువ, సుశిక్షితులైన సిబ్బంది అవసరం. 'జేన్ ్స ఆల్ ద వరల్డ్స్ ఎయిర్ క్రాఫ్ట్' మ్యాగజైన్‌ప్రకారం... ఎఫ్–35 యుద్ధ విమానాలకు (ఐదో తరం, బహుళార్థక, స్టెల్త్ రకం) ఆర్డర్ పెట్టిన తరువాత మొదటి విమానం అందేందుకు 15 ఏళ్లు పడుతుంది! ఇంకో విషయం – భారత్ ఏ రోజు కూడా లాక్ హీడ్ తయారు చేసే యుద్ధ విమానపు కొనుగోలుదారుగా కానీ, అమెరికా పారిశ్రామిక భాగస్వామిగా కానీ లేదు. నిజానికి ఎఫ్–35 యుద్ధ విమానాలు హైటెక్ పాశ్చాత్య దేశాల కోసం, అమెరికా రక్షణకు, సెక్యూరిటీ భాగస్వాములైన ఇతర దేశాల కోసం ఉద్దేశించినవి. 1996లో ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, ఇజ్రాయెల్, సింగపూర్, స్పెయిన్ , స్వీడన్ లకు ఈ కార్యక్రమం గురించి వివరించారు. ఎఫ్–35లు ఖరీదైనవని అప్పుడే అర్థమైపోయింది (ట్రంప్ సుంకాల తీరుతో తాజాగా నాటో దేశాలు కూడా వీటి కొనుగోలు గురించి పునరాలోచనలో పడ్డాయి).ముందుగా యూకేతో కలిసి పనిచేయాలని, పది శాతం ఖర్చులు ఆ దేశం భరించాలని యూఎస్‌తో ఒప్పందం జరిగింది. ఇటలీ, నెదర్లాండ్స్ చెరి ఐదు శాతం ఖర్చులు భరించేలా ఒప్పందాలు కుదిరాయి. మూడో దశలో డెన్మార్క్, నార్వే... 1–2 శాతం ఖర్చులు భరించేలా భాగస్వాములైనాయి. అనంతరం, ఆస్ట్రేలియా, కెనడా, టర్కీ తమ ఖర్చు తామే భరించేలా చేరాయి. 2012–13 నాటి 'జేన్ ్స ఆల్ ద వరల్డ్స్ ఎయిర్‌క్రాఫ్ట్' పత్రికను చూస్తే ఒక్కో ఎఫ్–35ఎ యుద్ధ విమానం ఖరీదు సుమారు 3.73 కోట్ల డాలర్లు. 2017 నాటికి ఇది 9.43 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇప్పుడు సుమారు పది కోట్ల డాలర్ల పైమాటే (రూ.860 కోట్లు). మారకం విలువలు, రూపాయి బలహీనపడటం వంటివి కూడా పరిగణనలోకి తీసుకుంటే ఎఫ్–35ల కొనుగోలు భారత్ ఖజానాకు భారీగా కన్నమేసేదే! ఇంత భారీ ఖర్చు కచ్చితంగా రాజకీయంగానూ సంచలనంసృష్టిస్తుంది.దీంతోపాటే ఎఫ్–35 యుద్ధ విమానాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞాన సంబంధిత సమస్యలు చాలానే ఉన్నాయి. అమెరికాలోనూ దీని గురించి వివాదాలు ఉన్నాయి. సమస్యలు ఒకవైపు, ఎప్పటికప్పుడు పెరిగిపోయే ఖర్చులు ఇంకోవైపు ఈ యుద్ధ విమానపు కొనుగోలుపై సందేహాలు లేవనెత్తుతున్నాయి. ఆర్థికాంశాలు, సాంకేతిక పరిజ్ఞాన అంశాలూ కాసేపు పక్కన పెడదాం. యుద్ధ విమానం భద్రత కూడా ఇక్కడ ప్రశ్నా ర్థకమే. 2010 అక్టోబరులో ఇలాంటి ఒక సమస్యను గుర్తించారు. విమానం ఎగురుతూండగానే ఎలాంటి ఆదేశాలూ లేకుండానే ఇంజిన్ ఆఫ్ అయ్యేందుకు వీలు కల్పించే ఓ సాఫ్ట్ వేర్ సమస్య తలెత్తింది. అప్పట్లో ఎడ్వర్డ్స్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో ఈ విమానాలను కొంత సమయం పాటు నిలిపివేశారు కూడా! పదిహేనేళ్లు దాటిపోతున్నా ఇప్పటికీ ఈ యుద్ధ విమానం ప్రయాణిస్తూండగా సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. 2014 జూన్ , జూలైల్లో ఎగ్లిన్ ఎయిర్‌ఫోర్స్ స్థావరం వద్ద కొన్నింటిలో ఇంజిన్ వైఫల్యం చోటు చేసుకుంది. ఈ ఘటన తరువాత వాటి వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కనుక అలాంటి విమానాలను కొని, కొరివితో తలగోక్కునే పరిస్థితిని భారత్ తెచ్చు కోదనే ఆశిద్దాం!

## డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: గత పదేళ్లలో తెలంగాణలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనూ రైతులను ఆదుకున్న దాఖలాలు లేవని చెప్పారు. ప్రస్తుతం వడగళ్ల వానతో నష్టోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో సమీక్షలు, సర్వేలు, నివేదికల పేరుతో కాలం గడిపారన్నారు. సర్వే చేసి వారం రోజుల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలిపారు.

"డీలిమిటేషన్‌పై కలిసిన వారంతా దొంగల ముఠానే. భారాస, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటే. కేసుల నుంచి తప్పించుకునేందుకు భారాసకు కాంగ్రెస్ సహకరిస్తోంది. దిల్లీలో కలిసి ఉంటారు.. గల్లీలో కొట్లాడుకుంటారు. డీఎంకే భేటీకి రెండు పార్టీలు వెళ్లాయంటే.. ఇద్దరూ ఒక్కటా?కాదా? కేసుల విషయంలో కేసీఆర్ కుటుంబానికి ఒక్క నోటీసు కూడా ఇవ్వట్లేదు. భాజపాకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడుతున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. ఆరు గ్యారంటీల హామీల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. తమిళనాడులో డీఎంకే రూ.వెయ్యి కోట్ల మద్యం కుంభకోణం చేసింది. డీఎంకేను సాగనంపేందుకు అక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు పక్కా ప్రణాళికతో ఇదంతా చేస్తున్నారు. దక్షిణాదిలో సీట్ల సంఖ్య తగ్గించబోమని అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. డీలిమిటేషన్‌కు ఎలాంటి నియమ నిబంధనలు పెట్టలేదని చెప్పారు. చెన్నైలో జరిగేది మాఫియా ముఠాల సమావేశం. అవినీతి, స్కామ్ పార్టీలు కలిసి భాజపాను అప్రతిష్ఠ పాలు చేసేందుకు యత్నిస్తున్నాయి." అని బండి సంజయ్ మండిపడ్డారు.

## దిల్లీ బడ్జెట్.. 10 వేల సూచనలు అందాయి: సీఎం రేఖాగుప్తా

మొదటిపేజీ తరువాయి

ఇంటర్నెట్ డెస్క్: త్వరలో ప్రవేశపెట్టనున్న వికసిత్ దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు ముఖ్యమంత్రి రేఖాగుప్తా వెల్లడించారు. ఇందులో మహిళల ఆర్థిక సాధికారత, విద్య, ఆరోగ్యం, యమునా నది ప్రక్షాళన, కాలుష్యం వంటివాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం 'ఖీర్' వేడుకతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దేశరాజధానిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. మార్చి 25న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

బడ్జెట్‌ను సిద్ధం చేసే ముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం నిపుణులతో సహా సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదించిందని రేఖా గుప్త తెలిపారు. ప్రజల నుంచి మెయిల్ ద్వారా 3,303 సూచనలు రాగా.. వాట్సప్ ద్వారా 6,982 సూచనలు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని పరిగణలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందిస్తామని అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను, ఉపాధి కల్పనను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం దిల్లీని అభివృద్ధి బాటలో నడుపుతుందని పేర్కొన్నారు.

## నేడు కాంగ్రెస్ ఆఫీసులో సమావేశం: ఎమ్మెల్యేల రాక

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు రేపు మార్చి 23 ఆదివారం నాడు మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉదయం 11:00 గంటలకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారు.కావున కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ లు, జిల్లా పరిషత్ చైర్మన్ లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొనగలరు.

## అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించిన సూపర్‌వైజర్

వనపర్తి పట్టణం ఎస్సీ వాడ 21వ వార్డు అంగన్ వాడీ సెంటర్ ను సూపర్ వైజర్ విజిట్ చేశారు.ఆ సంయంలో ఎఎన్ఎం అరుణకుమారి, ఆశ నిర్మల అంగన్ వాడీ టీచర్ లక్ష్మి ఉన్నారు.ప్రతినెల 4 వ శనివారం రోజు అంగన్ వాడీ సెంటర్ లో టీకాలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. 0.2–5 ఇయర్స్ చిన్నపిల్లలకు ఇంజక్షన్ వేయడం జరుగుతుంది గర్భిణీ స్త్రీలకు టీకా వేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు 21 వ వార్డు నాయకులు టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ గారు వార్డు మహిళా అధ్యక్షురాలు గంధం చిట్టెమ్మ కొమ్ముటిల్లు గంధం అన్నపూర్ణ ఈరపోగు అంజి తదితరులు పాల్గొన్నారు.

## హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు

దిల్లీ: ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయిత శుక్లానే కావడం విశేషం.భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. 1944లో ఏర్పాటైన ఈ పురస్కారాన్ని.. దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవంగా పరిగణిస్తారు. శుక్లా ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయిత. ఈ పురస్కారం కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషికిగానూ ఈ అవార్డు వరించింది. 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇక గత ఏడాది ఉర్దూ కవి, సినీ గేయరచయిత గుల్జార్ సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ఈ పురస్కారాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.

# రాష్ట్రవ్యాప్తంగా దావత్ ఏ ఇఫ్తార్

మొదటిపేజీ తరువాయి

ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని, చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ–సీఎం తెలిపారు. లా అండ్ ఆర్డర్, ఎలక్ట్రిసిటీ–, మంచినీరు వాటి అంశాలు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. ఏర్పాట్లలో ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనా అధికారులు మొహమాట పడకుండా జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏర్పాట్లకి సంబంధించి రోజువారి సమీక్షను ప్రభుత్వ సలహాదారు, ఏర్పాట్ల కమిటీ– వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ రోజువారి సమీక్ష చేస్తారని తెలిపారు.సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, దావత్ ఏ ఇఫ్తార్ కు కూడా ఘనంగా ఏర్పాట్లు– చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ మా ప్రభుత్వం దావత్ ఏ ఇఫ్తార్ ను ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. సమావేశంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

చెన్నై: డీలిమిటేషన్‌పై ప్రశ్నించకుంటే తమను చరిత్ర క్షమించదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ అంశంపై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

"దక్షిణాది రాష్ట్రాలపై భాజపా ప్రభుత్వం వివక్ష చూపిస్తోంది. డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతుంది. కేంద్రం చూపించే వివక్షతో దక్షిణాది పూర్తిగా నష్టపోతుంది. జనాభా ఆధారంగా సీట్లు పెంచడం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం. ఈ విధానాన్ని అవలంబిస్తే అనేక నష్టాలున్నాయి. దేశాభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తుంది. డీలిమిటేషన్ విధానాన్ని అనుసరించడం ద్వారా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో తిరిగే వారికి వ్యవసాయం ఏమి తెలుసు

మొదటిపేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తమ్ముడూ నీ లైఫ్ స్టైల్ వేరు..నా లైఫ్ స్టైల్ వేరు' అని సీతక్క అన్నారు. ములుగు నియోజకవర్గంలో తాను తిరిగినట్లు నువ్వు తిరగలేవు అని చెప్పారు. ప్రజలకు ఎవరు ఎక్కువ అందుబాటులో ఉంటారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదన్న కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. హైదరాబాద్‌లో తిరిగే వాళ్లకు రైతులకు బోనస్ వస్తుందో లేదో తెలుస్తుందా అని ప్రశ్నించారు. రైతులతో సంబంధం లేకుండా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు తిరుగుతున్నట్లు ఉందని విమర్శించారు. బోనస్ ఇస్తామని చెప్పి రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం బోగస్ చేసిందని ఆరోపించారు. వరి వేస్తే ఉరి అన్నది మాజీ సీఎం కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం సన్నవడ్లకు రూ.1200 కోట్లు బోనస్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇంకా ఎవరికన్నా రాకపోతే అవి కూడా ఇస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామని ప్రకటించారు. భూమి లేని వాళ్లకే కూలీ భరోసా ఇస్తున్నామని చెప్పారు. కొంత భూమి ఉన్న కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలనే అంశం పరిశీలనలో ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తమ ఇంటికి రావాలని మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. ప్రభుత్వం వసతి కల్పించిన క్వార్టర్స్‌లోనే తాను నివసిస్తున్నానని స్పష్టం చేశారు. వైఎస్ భవనంలో ఉండటం తాను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అది వైఎస్ హయాంలో నిర్మించిన భవనమేనని చెప్పారు. ఆ భవనంలోనే తాను ఉంటు–న్నానని అన్నారు. బీఆర్ఎస్ నేతల్లాగా ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోటల్లో తాను నివసించడం లేదని తేల్చిచెప్పారు. తమ ఇంటికి వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరిని భోజనానికి ఆహ్వానిస్తున్నానని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఆహ్వానించలేదని చెప్పారు. నాది నిరాడంబర జీవితమని ఉద్ఘాటించారు. తన కుమారుడు కూడా హన్మకొండలోనే ఉంటారని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డిపై బిఆర్ఎస్ హక్కుల నోటీస్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రిగా ఉండి అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నాడని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. సభను తప్పు దోవ పట్టిస్తున్నారు అని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై తక్షణమే చర్య తీసుకోవాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు.

## స్టాక్ మార్కెట్ పేరుతో రూ.1.22 కోట్లు టోకరా.. నిందితుడి అరెస్టు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: స్టాక్ మార్కెట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అంకిత్ అరోరాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 11 ఏటీఎం కార్డులు, 2 సెల్‌ఫోన్లు, 11 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అంకిత్ అరోరా స్టాక్ మార్కెట్ పేరుతో సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.1.22 కోట్లు కాజేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. అంకిత్‌ను అరెస్టు చేశారు. నిందితుడిపై దేశవ్యాప్తంగా ఇప్పటికే 23 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే.. పార్టీ అధ్యక్షుడు రబ్బర్ స్టాంప్‌గానే ఉంటారు: రాజాసింగ్

మొదటిపేజీ తరువాయి

పార్టీ కొత్త అధ్యక్షుడు సీఎంతో రహస్య భేటీలు నిర్వహించవద్దు. సీనియర్ నేతలు, కార్యకర్తల మనసులో మాట బయటపెడుతున్నా. పార్టీ నేతలకు చెప్పాలే గానీ మీడియాకు చెప్పవద్దని కొందరు చెబుతున్నారు. పార్టీ పెద్దల దృష్టికితెచ్చినా వినకపోవడం వల్లే ప్రజల ముందు పెడుతున్నా. సీనియర్ నాయకులను భాజపా గుర్తించలేదు. నామినేటెడ్ పోస్టులను సీనియర్ నేతలకు ఇవ్వడం లేదు" అని రాజా సింగ్ చెప్పారు

# ఇఫ్తార్ విందు రద్దు చేయాలి

# ఆ నిధుల్ని ఆపేయాలి

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు జరుపుకునే ఇఫ్తార్ ను ఒక ఈవెంట్ గా మార్చారని కాంగ్రెస్ నాయకురాలు శ్రీమతి లుబ్నా సర్వత్ మీడియాతో అన్నారు.10 సంవత్సరాలుగా నేను ఈ పోరాటం చేస్తున్నానని, 2017 సం.లో ఈ ఇఫ్తార్ విందు దుబారా ఖర్చు నిలుపుదల చెయ్యమని కోరుతూ తెలంగాణ హైకోర్టు లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పిల్ వేశానని ఆమె అన్నారు.తాజాగా ఈ సం. ఈ అనాచారాన్ని ఆపమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ కూడా రాశానని లుబ్నా సర్వత్ అన్నారు.మీడియా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఇఫ్తార్ అనేది ఒక ఆడంబరం గా మారిందని, ఇస్లాం ఉన్నత ఆశయాలకు ఈ ప్రాయోజిత ఇఫ్తార్ ల వల్ల రంజాన్ పవిత్రత దెబ్బ తింటున్నదని అన్నారు.రాష్ట్ర బడ్జెట్ లో మైనారిటీ వెల్ఫేర్ పద్దు కింద ముస్లింలకు క్రైస్తవులకు వారి సంక్షేమం కొరకు 66 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు అని చెబుతూ, 3 కోట్ల రూపాయలు ప్రభుత్వం వినియోగం చేసుకునే పద్దు క్రింద కేటాయింపు చేసారని,మొత్తం దాదాపు 70 కోట్ల రూపాయలు మైనారిటీల సంక్షేమం కొరకు మాత్రమే కేటాయింపు జరిగిందని సర్వత్ తెలిపారు.ముఖ్యమంత్రి తో పాటు మైనారిటీ వ్యవహారాల సలహాదారు శ్రీ షబ్బీర్ అలీ గారికి, ఖురేషీ గారికి,బట్టి విక్రమార్క గారికి, బ్యూరో క్రాట్స్ తౌసీన్ ఇక్బాల్ మరియు యాసిన్ భాషా గారికి కూడా వ్రాత పూర్వక విజ్ఞప్తి చేసానని అన్నారు.

నేను లేఖలు పంపిన తర్వాత కమిటీ కూర్చుని ఒక నిర్ణయం చేసారని, ఆ నిర్ణయం ప్రకారం 850 మసీదులకు నిధులు పంపిణీ చేయాలని తీర్మానించారు. ఇఫ్తార్ విందుల కొరకు ఒక్కొక్క మసీదుకు ఒక లక్ష రూపాయల చొప్పున డబ్బు అందించాలని నిర్ణయించారు.

లక్షల మసీదులున్న తెలంగాణాలో ఈ 850




మసీదులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేసారని ఆమె ప్రశ్నించారు.కమిటీ మంజూరు చేసిన ఆ నిధులు ఎక్కడికి పోతాయో అందరికీ తెలుసు, స్థానిక కార్పోరేటర్ల,ఎమ్మెల్యేల,ఎంపీల జేబుల్లోకి వెళతాయని అన్నారు.పేదలకు,అతి పేద ముస్లింలకు ఒక్క పైసా అందదని అన్నారు.ఇఫ్తార్ పేరుతో ఆర్భాటాలు తప్ప పేదవారికి ఏమీ ఉపయోగం లేదు అన్నారు.

ఈ రంజాన్ సందర్భంగా కొందరు పేద ముస్లింలకు బట్టలు అందిస్తున్నారని,ఆ నాసి రకం బట్టలు కట్టుకోవడానికి అస్సలు పనికిరావని అన్నారు.ఈ ఇఫ్తార్ లలో మీడియా ముందు ఒక షో నిర్వహిస్తారని అన్నారు.ముఖ్యమంత్రులు,మంత్రులు,ఎమ్మెల్యే,ఎంపీ లతో పాటు పెద్ద పెద్ద నాయకులు మాత్రమే జిగేల్ మనే మెరుపుల్లో కనిపిస్తారని, ఆ ఇఫ్తార్ లో ఒక్క పేదవాడైన కనిపించదని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు.మైనారిటీల సంక్షేమం కొరకు వాడాల్సిన ఆ నిధులు ఇఫ్తార్ ల పేరిట దుర్వినియోగం చేయడం తప్పు అని అన్నారు.ఇలా విందులు జరికోవడం సంక్షేమం అవుతుందా? అది అనవసర ఆర్భాటం కాదా? అని ఆమె అన్నారు.

ప్రభుత్వం వద్ద డబ్బు లేదు అని ఒక పక్క చెబుతూ ఇలా ఇఫ్తార్ పేరిట డబ్బు ఖర్చు చెయ్యడం రాజకీయ ప్రమోషన్ మాత్రమే అని ఆమె తీవ్రంగా ఈ అసహజ ఇఫ్తార్ ను విమర్శించారు.ఇది ప్రజాధనం దుర్వినియోగం కాదా? అది ప్రజా ద్రోహం కాదా? అని ఇఫ్తార్ నిర్వహణను తీవ్రంగా ఆక్షేపించారు.డబ్బుల్లేవు డబ్బుల్లేవు అని ప్రతిరోజూ చెప్పుకుంటున్న ప్రభుత్వం పేద వారి పెన్షల గురించి,విద్యార్థుల స్కాలర్ షిప్పుల గురించి, వైద్య సౌకర్యాల గురించి, స్కూల్స్ లో సౌకర్యాలు, సరిపోయే టీచర్ల నియామకం గురించి ఇలా ప్రజా సంబంధ విషయాలు,సంక్షేమం గురించి ఆలోచించకుండా ఈ రాజకీయ ఇఫ్తార్ లను జరపడం తప్పు అని అన్నారు.నిజామాబాద్,ఆదిలాబాద్ లాంటి చోట్ల చాలా ప్రాంతాల్లో టీచర్ల కొరత ఉందని ఎన్నో ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ విషయం గురించి నేను విద్యా శాఖ కమీషన్ ను కలిసి విద్యార్థుల,పాఠశాలల బాధలు ఏకరువు పెట్టాను అని అన్నారు. ఇదంతా ఆర్థిక సంబంధ విషయం అనుకుందాం. మరి ఇఫ్తార్ అనేది పూర్తిగా మత సంబంధిత విషయం.

## ఇఫ్తార్ అంటే ఏమిటి

ఇఫ్తార్ ముస్లింల వ్యక్తిగత విషయం. అల్లాకు దగ్గరగా మెసలుతూ, శరీరానికి కష్టం కలిగిస్తూ, ఆత్మను మనస్సును శుద్ధి పరచుకునే పవిత్ర ఆచారం ఇఫ్తార్ అని అన్నారు.సూర్యోదయం కంటే ముందు సహరీ చేసి సూర్య ఉదయం నుండి సూర్య అస్తమయం వరకు నీళ్ళు,ఆహారం లేకుండా నియమంగా ఆచరించే రంజాన్ రోజులు పూర్తిగా ముస్లింల వ్యక్తిగత విషయం.

సూర్య అస్తమయం అవ్వగానే ముస్లింలు కజూర్ గానీ,ఏదేని ఇతర పండ్లు ఫలహారం తింటారు. ఎవరి శక్తి మేరకు వారు తగిన ఆహారం తింటారు. రంజాన్ మాసంలో పేదలు ధనవంతులు అని తేడా లేకుండా ముస్లింలందరూ ఉపవాసాలు చేస్తారు. అంటే ఆ పూట, ఆ రోజు అందరూ సమానం అయిపోతారు. ఎలాంటి తేడా లేని సమానత్వ భావాన్ని అందరూ అనుభవిస్తారు.ఈ ఉపవాస సమయంలో పేద వాడి కడుపు,ధనవంతుడి కడుపు సమానంగా ఉండిపోతుంది.ఈ ఉపవాస సమయంలో ప్రతి ముస్లిం తన తప్పులు క్షమించమని, సద్బుద్ధి ప్రసాధించనని ఆ కరుణామయున్ని వేడుకుంటారు.ఇంతటి పవిత్ర ఇఫ్తార్ ను రాజకీయం చేసి, లబ్ధి పొందే ప్రక్రియ కొనసాగడం అభిలషణీయం కాదు అని శ్రీమతి సర్వత్ అన్నారు.ఉపవాసం ఉండి ప్రతి ముస్లిం తన గురించి,పక్క వారి గురించి,సమాజం,దేశం,ప్రపంచ క్షేమం గురించి అల్లాను ప్రార్థిస్తాడు అని అన్నారు.ఇస్రాఫ్ అంటే ఆహారాన్ని వృధా చెయ్యడం గానీ, కబ్రహ అంటే ఆర్భాటం చెయ్యడం మానుకోవాలని రంజాన్ మాసం నేర్పుతుంది.

## కానీ జరుగుతున్నదేమిటి

ఖురాన్ వద్దని చెప్పిన ఇస్రాఫ్, కబ్రఫ్ ను చేస్తూ కొందరు చేస్తున్నది నియమాలకు విరుద్ధం. ఇది తగదని ఆమె అన్నారు.

## జకాత్ ను మాత్రమే ఖురాన్ అనుమతించింది ్ర

ప్రతి ముస్లిం తన సంపాదన నుండి తనకు కుటుంబానికి సంవత్సరమంతా అవసరమైన ఖర్చులు చేయగా మిగిలిన డబ్బుల నుండి ఇచ్చేది జకాత్.

ప్రతి వెయ్యి రూపాయలకు 25 రూపాయల చొప్పున తిరిగి సమాజానికి జకాత్ ఇవ్వాలని ఇస్లాం ఒక ఆదేశం ఇచ్చింది.

**కానీ ఇక్కడ జరుగుతున్నదేమిటి?**
**ప్రభుత్వం చేస్తున్నదేమిటి?**

ఇఫ్తార్ పేరిట ప్రజల సొమ్మును,ప్రభుత్వ సొమ్మును రాజకీయ లాభాలకొరకు వృధా చెయ్యడంతో పాటు,ఇస్లాం విశ్వాసాలను కించపరుస్తున్నారని ఆమె అన్నారు.

ఈ అనాచారాం జరగకుండా చూడడం మైనారిటీ కమీషన్ అడ్వైజర్ భాధ్యత కాదా అని శ్రీమతి సర్వత్ ప్రశ్నించారు.

నేను పిల్ వేసిన తర్వాత జమాతే ఇస్లామీ ప్రసిడెంట్ నాకు పర్సనల్ గా ఫోన్ చేసి నా వాదన అక్షరాలా నిజం అని అన్నారు.

ఈ సంవత్సరం నుండి మేము ప్రభుత్వ ఇఫ్తార్ లకు వెళ్ళమని అన్నారు.అప్పటి నుండి వారు ఏ ప్రభుత్వ ఇఫ్తార్ కు హాజరు కాలేదు.

## - ఇఫ్తార్ లకు వెళుతున్నది రాజకీయ ప్రతినిధులు మాత్రమే

ప్రజల సొమ్మే ప్రభుత్వ సొమ్ము.
ఈ సొమ్ముతో ఇఫ్తార్ తినడం ఇస్లాం విరుద్ధం. జకాత్ నియమం తుంగలో తొక్కి ఈ రాజకీయ ఇఫ్తార్ లకు వెళ్లడం ఖురాన్,ఇస్లాం వ్యతిరేకం అని సర్వత్ అన్నారు.

## ఒవైసీ లాంటి ధనవంతులకు ఇఫ్తార్ అవసరమా?

తమ ఆదాయం నుండి చెల్లించే జకాత్ కాదని, ఇలా ప్రజల ప్రభుత్వ సొమ్ము తో జరిపే ఇఫ్తార్ ఏ విధంగానూ సమర్థనీయం కాదు,ఇది ఖురాన్ వ్యతిరేకం అని అన్నారు.

**ఎమ్మెల్యేలు,ఎంపీలకు వెల్ఫేర్ పథకాలు అవసరమా?**
ఒవైసీలకు సంక్షేమ పథకాలు అవసరమా?
కన కన మండే కడుపుకు తిండి అవసరం. ఈ రంజాన్ మాసంలో పేద వాడి కడుపు,ధనవంతుడి కడుపు సమానంగా ఆకలితో అలమటించాలి.
ఆకలి దప్పులు దహిస్తున్నా ప్రతి ముస్లిం తన పని మానకుండా ఆ కరుణామయుని స్మరణతో పవిత్రంగా జరుపుకునే ఈ రంజాన్ ఉపవాసాలను ఇఫ్తార్ పేరుతో కించపరచడం తప్పు అని అంటూ,
ప్రభుత్వ ప్రాయోజిత ఇఫ్తార్ విందులను రద్దు చేయాలని శ్రీమతి లుబ్నా సర్వత్ బహిరంగ విజ్ఞాపన చేసారు.
**చాలా మంది ముస్లిం పెద్దలు ఆమె వాదనను సమర్థిస్తున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం.**

# బెట్టింగ్ యాప్స్ నిషేధించాలి

ఆకుల రంజిత్, కరపత్రం కోరుట్ల

**- బెట్టింగ్ యాప్స్ ను నిషేధించాలని కోరిన భారత్ సురక్ష సమితి**
**- యువకుల జీవితాల పాలిట ఉరితాళ్ళుగా మారిన యాప్స్ ను ఇంటర్నెట్ నుండి తొలగించాలి**

భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించిన బిఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్ వల్ల ప్రతిరోజు పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయని,విలువైన యువత జీవితాలు అర్ధాంతరంగా ముగిసి పోతున్నాయని అన్నారు.

ఇప్పటివరకు దేశంలో కొన్ని లక్షల్లో కేవలం బెట్టింగ్ కారణంగానే ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నాయి.ఇల్లీగల్ బెట్టింగ్ సైట్లు ప్రమోట్ చేసిన ప్రకాష్ రాజ్ మరియు ఇతర సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ లు, కొందరు సినీ ప్రముఖులు మరియు ఇతర వ్యక్తులు యువకుల జీవితాలను ఈ అక్రమ యాప్స్ వలలోకి



లాగుతున్నారు.సాంకేతికత పెరిగిన ఈ మారణ యాప్స్ ను నియంత్రించడం చిన్న విషయం.మరి ప్రభుత్వాలు ఎందుకు ఈ ఉపద్రవాన్ని ఆపలేక పోతున్నాయని బిఎస్ఎస్ నాయకుడు మాజీ కౌన్సిలర్ శ్రీ ఎసిఎస్ రాజు ప్రశ్నించారు.బెట్టింగ్స్ కారణంగా చాలామంది యువత నాశనం అయిపోతున్నారని, యువతను ఈ ఉచ్చులోనికి లాగిన సెలబ్రిటీలపై క్రిమినల్ కేసులు పెట్టాలని రాజు అన్నారు.అప్పుల పాలై కుటుంబానికి సమాజానికి జవాబు చెప్పుకోలేక ఆత్మాభిమానాన్ని చంపుకోలేక యువత ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి దిగజారిపోయారని, దీనివల్ల తల్లిదండ్రులకు కడుపుకోత, భారత మాతకు యువత కొరత ఏర్పడుతున్నదని రాజు అన్నారు.కాబట్టి బెట్టింగ్ యాప్స్ ను డౌన్లోడ్ చేయవద్దు, బెట్టింగ్ ప్రకటనలకు కూడా చాలా దూరంగా ఉండండి అని ఎ సి ఎస్ రాజు కోరారు..

ఈ కార్యక్రమంలో బి ఎస్ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ %రాజా% రాజు తో పాటు, అడ్వకేట్ పుప్పాల సత్యనారాయణ, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, నరేందుల శ్రీనివాస్, ఎడమల వెంకట్ రెడ్డి, బండారి మల్లికార్జున్, బొందుకూరి శ్రీనివాస్, కొత్తకొండ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.
భారత సురక్ష సమితి డిమాండ్ ను జగిత్యాల లోని అన్ని వర్గాల ప్రజలు,నాయకులు సమర్తిస్తున్నారు.
పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఈ బెట్టింగ్ యాప్స్ ను నిషేదించాలని కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న కాంగ్రెస్...

## - టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్..

## - అనుమతులు ఇచ్చి అడ్డుకోవడం సిగ్గుచేటు

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిది

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు శనివారం ఇందిరా పార్క్ వద్ద గత ప్రభుత్వం 2021లో ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చిన ఐదు కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలంటూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడానికి వెళుతున్న కార్మిక సంఘాల నాయకులు మల్లేష్, పి.వరదయ్య, శంకర్ గౌడ్, సంజయ్ లను శనివారం




తెల్లవారుజామున పట్టణ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వామ పక్షాల నాయకులు మాట్లాడుతూ తమను అక్రమంగా అరెస్టు చేసి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం ధర్నాలకు, సభలకు, ప్రదర్శనలకు అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటే, నేటి ప్రభుత్వం అనుమతులను ఇచ్చి అడ్డుకుంటుందని ఈ పరిస్థితి చూస్తే ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దొందూ-దొందే లాగానే ఉన్నాయని తీవ్రంగా మండిపడ్డారు. అప్పటి ప్రభుత్వం నియంతృత్వ విధానాలను అనుసరించడం మూలంగానే కెసిఆర్ ను ఇంటికి పంపించారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రహించి ఎన్నికల్లో ఆరు హామీలతో పాటు ఏడవ హామీ అయిన ప్రజాస్వామ్య పరిరక్షణను కాపాడాలని కోరారు. లేనట్లయితే కెసిఆర్ కు పట్టిన గతే రేవంత్ ప్రభుత్వానికి కూడా పడుతుందని వారు హెచ్చరించారు.

# బాన్సువాడలో అక్రమ ఇండ్లపై వారం రోజుల్లో చర్య తీసుకుంటా... అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**కరపత్రం బాన్సువాడ మార్చి 22**
బాన్సువాడ పట్టణంలో అక్రమ ఇండ్ల నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ పై శనివారం బిజెపి నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బిజెపి నాయకులను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి వారి సమస్యలను తెలుసుకున్నారు. అక్రమ ఇండ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జా, 10 శాతం భూములపై సమగ్ర విచారణ జరిపి వారం రోజుల్లో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన బిజెపి నాయకులకు హామీ ఇవ్వడంతో బిజెపి నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసిల్దార్ వరప్రసాద్, సిఐలు మండల అశోక్, రాజేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి... సిఐటియు నాయకులు రవీందర్

**కరపత్రం బాన్సువాడ మార్చి 22**
ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు రవీందర్ అన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం 18000, ఉద్యోగ భద్రత ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించినట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లావణ్య, గంగమణి ,అనురాధ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఏక్బాల్ మృతదేహానికి నివాళు లర్పించిన పార్టీ ఇన్చార్జ్ ఏనుగు

**కరపత్రం బీర్కూర్ మార్చి 22**
బీర్కూరు మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఏక్బాల్ మృతి చెందడంతో శనివారం పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి ఏక్బాల్ మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, ప్రతాప్ సింగ్, డిసిసిబి డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి ద్రోణవల్లి సతీష్, అమ్జద్,పార్టీ మండలాల అధ్యక్షులు మంత్రి గణేష్, నందు పటేల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వభారతిలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్:







- కరాటే తో మానసిక శారీరక దృఢత్వం:
- విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్:

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

ఒకినావా కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ , విశ్వ భారతి విద్యాసంస్థల సంయుక్త నిర్వహణలో శనివారం విశ్వ భారతి హైస్కూల్లో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్, పాఠశాలల విద్యార్థులు దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కరాటే బెల్ట్ టెస్ట్ లో పాల్గొన్న విద్యార్థులు తమ విన్యాసాల ద్వారా పేరెంట్స్ ను కరాటే ప్రతినిధులను అబ్బురపరిచారు . తమ విన్యాసాలను నైపుణ్యాలను చూపించి బహుమతులు గెలుచుకున్నారు. బెల్ట్ టెస్ట్ అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు బెల్టులు సర్టిఫికెట్లు పాఠశాల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ , చెప్యాల కేశవరావు , హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్ , కరాటే మాస్టర్ మొండయ్య , ,ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు.బెల్టుల ప్రధాన అనంతరం కరాటే ప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కరాటే గ్రాండ్ మాస్టర్ బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్ అయినటువంటి మొండయ్య ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ బెల్ట్ టీచర్ కావ్య ,బ్లాక్ బెల్ట్ క్రాంతి, అమృత్, అధిక సంఖ్యలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



- డిఐఈవోను అభినందించిన కలెక్టర్...

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరం పరీక్షలను పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ఇంటర్ విద్య అధికారితో పాటు పరీక్షల నిర్వహణ కమిటీని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి కలెక్టర్ కు పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా ఆధికారి తిరుమలపుడి రవికుమార్ మాట్లాడుతూ,పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు జిల్లా పరీక్షల విభాగంకు విద్యుత్ శాఖ,ఆర్టీసీ,ఆరోగ్యశాఖ,పోస్టల్ శాఖ,మున్సిపల్,గ్రామ పంచాయతీ విభాగాలు సహకరించాయని అన్నారు.అలాగే జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఎప్పటికప్పుడు తమకు సహకరిస్తూ అన్ని విభాగాలను సమన్వయం చేసి తమను ఇంటర్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు ముందుకు నడిపించారన్నారు.ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియోదిన్,అస్లాం,హై పవర్ కమిటీ శ్రీనాథ్ పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



రామగుండం-3 ఏరియాలోని వివిధ గనులు,విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన,మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించిన 15 మందికి కారుణ్య నియామక ఉద్యోగాల ఉత్తర్వులను శనివారం జి.ఎం. కార్యాలయందు నిర్వహించిన కార్యక్రమంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినప్పటికీ సింగరేణి సంస్థలో ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్ ఉద్యోగంలో చేరుతున్నారని,అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా పని చేస్తూ,అధికారులు,సూపర్ వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ,భద్రతతో విధులు నిర్వహించాలని కోరారు.సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరం లాంటిదని,చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని,సీనియర్ ఉద్యోగుల దగ్గర పని నేర్చుకొని,కలిసి కట్టుగా పనిచేస్తూ భవిష్యత్తులో పదోన్నతులు పొందుతూ,కుటుంబంతో పాటు సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రరెడ్డి,కోట రవీందర్ రెడ్డి,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,డి.పి.ఎం.గుర్రం శ్రీహరి, సీనియర్ అసిస్టెంట్ శిరీష,తదితరులు పాల్గొన్నారు.

# 24 నుండి ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

ఈనెల 24వ తేదీ నుండి ఫిజిక్స్,ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ తెలియజేశారు.ఫిజిక్స్,ఎకనామిక్స్ అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాల లాగిన్లలో నిక్షిప్తం చేసినట్లు తెలియజేశారు.వెంటనే తమ అపాయింట్మెంట్ ఆర్డర్లను డౌన్లోడ్ చేసుకొని 24వ తేదీన ఉదయం పదిన్నర గంటలకు మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ,ప్రైవేట్, ఎయిడెడ్,ఆయా గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్ లు వెంటనే ఫిజిక్స్,ఎకనామిక్స్ అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రిన్సిపాల్ లు వెంటనే మూల్యాంకనం ఆర్డర్ కాపీలు వచ్చిన అధ్యాపకులను విధుల నుండి రిలీవ్ చేయనట్లయితే ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటామని ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు.నాట్ అప్పాయింటెడ్ లిస్టులో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యార్థి అధికారి తెలిపారు.

# సాహితి జయంతిని పురస్కరించుకొని గార్డియన్ స్కూల్లో అన్నదాన కార్యక్రమం...!





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 22

జమ్మికుంట : సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గార్డియన్ స్కూల్లో శనివారం సాహితి జయంతిని పురస్కరించుకొని ఫౌండేషన్ చైర్మన్ రాముల కుమార్ ఆధ్వర్యంలో పిల్లలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి గ్రామీణ పరిసర ప్రాంత పిల్లలకు తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయిలో ప్రైవేటు విద్యను అందిస్తున్నామని. పాఠశాలలోని పిల్లలందరికీ ఉచిత నోట్ బుక్స్, స్లెట్స్ , పెన్నులు, ఇస్తున్నామని. పేద మధ్యతరగతి పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వచ్చే విద్యా సంవత్సరం నుండి నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు అడ్మిషన్స్ పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకూస్, సాహితీ ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొండం శ్రీధర్ రెడ్డి, టిపిటిఎల్ఎ ప్రెసిడెంట్ రహమాన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు సీఎం రాక

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి



ఈ నెల 23న ఆదివారం జిల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు.నిజామాబాద్ జిల్లాలోని మోపాల్ మండలం నర్సింగ్ పల్లిలో గల ఇందూరు తిరుమల వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని,ఇందూరు తిరుమలలో జరిగే స్వామి వారి కళ్యాణానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు.ఆదివారం జరిగే స్వామివారి కల్యాణానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

# మున్సిపల్ కమిషనర్ ను సన్మానించిన మసీద్ కమిటీ





కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 22

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో మసీద్ అధ్యక్షులు ఎం డి జాకీర్ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే ఆస్తి పన్ను వసూల్లో మొదటి స్థానము నిలిచినందుకు రాష్ట్ర ప్రభుత్వం జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ ను సన్మానించడంతోపాటు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం జరిగింది రాష్ట్రంలోనే నెంబర్ వన్ తనం నిలబెట్టిన కమిషనర్ ఎండి ఆయాజ్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ ను మసీదులో శాలువాలతో సత్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు

# నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్లు షురూ

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి



నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2025-26 వార్షిక ఎన్నికలకుగాను నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది.తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వుల మేరకు ఏర్పాటు అయిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ అడ్ హాక్ కమిటీ ఛైర్మన్ ఆకుల రమేష్,సభ్యులు బాస రాజేశ్వర్,జి.నరసింహ రెడ్డి,శ్రీహరి ఆచార్య ల ఆదేశాల మేరకు ఎన్నిక అధికారులుగా నియమితులైన సీనియర్ న్యాయవాదులు జె.వెంకటేశ్వర్,ఆర్.ఎస్.ఎల్ గౌడ్ జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ ఎన్నికల కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించారు.ఎన్నికల అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం బార్ ప్రధాన కార్యదర్శి పదవికి సీనియర్ న్యాయవాది బట్టు మానిక్ రాజు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.క్రీడల కార్యదర్శిగా మంజిత్ సింగ్,కార్యవర్గ సభ్యునిగా మద్దెపల్లి శంకర్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు వారు తెలిపారు.మార్చి 26 వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తామని వివరించారు.

# ఎన్టీపీసీ రామగుండంలో ప్రపంచ నీటి దినోత్సవం



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ (ఆర్ అండ్ టీ)లో నిర్వహించారు. ఈ వేడుకలో నీటి సంరక్షణపై ఆన్లైన్ సూచనల రాత పోటీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్ అండ్ టీ) చందన్ కుమార్ సమంత, సంప్రదాయబద్ధంగా దీపాలు వెలిగించి అధికారికంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ఓ అండ్ ఎం జీఎం అలోక్ కె త్రిపాఠి, ఏఆర్ డాష్, జీఎం ఓ అండ్ ఎం తెలంగాణ, కేసీ సింఘా రాయ్, జీఎం (ఆపరేషన్స్) సహా ఇతర ప్రముఖులు హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ)లో చీఫ్ సైంటిస్ట్ మరియు టెక్నికల్ కన్సల్టెంట్ డాక్టర్ ఎన్.రవీంధర్ ప్రసంగించారు. డాక్టర్ రవీంధర్ నీటి ప్రాముఖ్యత, ప్రపంచ నీటి దినోత్సవం ప్రాముఖ్యతపై ప్రసంగించారు. స్థిరమైన నీటి నిర్వహణ, పరిరక్షణ పద్ధతులకు కీలకమైన అవసరాన్ని తెలిపారు. సూచనల రచన పోటీలో పాల్గొనేవారి ఆలోచనాత్మక సహకారాలు, వినూత్న ఆలోచనలను గుర్తిస్తూ బహుమతి పంపిణీ కార్యక్రమంతో కార్యక్రమం ముగిసింది.